క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ ఎస్‌కె.బురాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీ 1, కామర్స్ 1, జువాలజీ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హతలు, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 7న కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు తమ బయోడేటా, ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

రోడ్డుపై మట్టి తొలగింపు

అశ్వారావుపేటరూరల్: పట్టణంలోని ఖమ్మం మార్గంలో జాతీయ రహదారిలో డివైడర్‌కు రెండు వైపులా పేరుకుపోయి ఉన్న దుప్ప మట్టి, చెత్తాచెదారాన్ని గురువారం మున్సిపాలిటీ సిబ్బంది తొలగించారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో కొద్దిరోజులుగా సాగుతున్న నిర్మాణ పనులతో మట్టి, ఇసుక పేరుకుపోయింది. విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ కమిషనర్ నాగరాజు రహదారిని శుభ్రం చేయిస్తున్నారు. జంగారెడ్డి గూడెం, భద్రాచలం మార్గాల్లో కూడా శుభ్రం పనులు చేపట్టుతామని సిబ్బంది తెలిపారు.

లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

భద్రాచలంటౌన్: ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన కొనసాగుతున్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి విద్యార్థిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో గురువారం డీడీ విజయలక్ష్మి పర్యవేక్షణలో డ్రా తీయగా కామేపల్లి మండలం పాత లింగాలకు చెందిన జగన్నాథం జ్ఞానేశ్వర్, వెయిటింగ్ లిస్టుకు ఖమ్మం రూరల్ మండలం పోలంపల్లికి చెందిన దుగ్గిరాల యశ్వంత్ ఎంపికయ్యాడు.ఏసీఎంఓ రమేష్, జేడీఎం హరికృష్ణ, ఉద్యోగులు పాషా, రాజేశ్వర్, ఆబిద్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం..

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో కట్టుగూడెంలో అవసరమైన వారికి మందులు అందించారు. గ్రామంలోని పలువురి ఇంటికి వెళ్లి జ్వరపీడితుల నుండి రక్త నమూనాలు సేకరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రామదాసు, రాణి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని వివిధ విభాగాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన అధికారులను ఏరియా జీఎం దుర్గం రాంచందర్ గురువారం ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలం పనిచేసిన ఎస్ఎంఎస్ ప్లాంట్ (డీజీఎం) నర్సింహస్వామి, జూనియర్ అకౌంటెంట్ వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ కందూరి అంకిరెడ్డిల సేవలను కొనియాడారు. ఏరియా అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు..

దుమ్ముగూడెం: మండలంలోని గౌరారం ఆశ్రమ బాలికల పాఠశాలలో ఇర్ప అనసూయ, నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో నాగేశ్వరరావుల పదవీ విరమణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. వారి సేవలను కొనియాడారు. ఏసీఎంఓ కిసారి రమేష్, మాజీ ఏసీఎంఓ తెల్లం రమణయ్య, ఎంఈఓ సున్నం సమ్మయ్య, హెచ్‌ఎంలు మడకం మోతీరుర, ఏవీ రామారావు, బెక్కంటి శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఏజే ప్రభాకర్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్ట్ సమస్యలను పరిష్కరించాలని, అదనపు కోర్ట్ ఏర్పాటు చేయాలని కోరుతూ.. తెలంగాణరాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గోకుల రామారావులకు మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రాలు అందజేశారు. వారు సానుకూలంగా స్పందించినట్లు మణుగూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. సీనియర్ న్యాయవాది ఎస్‌వీ రమణారెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చిర్రా రవికుమార్, లైబ్రరీ సెక్రటరి గురుకృష్ణ, స్పోర్ట్స్ కార్యదర్శి కామసాని వీరమధుసూదన్, కమిటీ సభ్యులు రుద్ర వెంకట్, న్యాయవాదులు సర్వేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

కట్టడాలను నిలిపివేయాలి

మణుగూరుటౌన్: మండలంలోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు సంబంధించిన 12 అంతస్థుల భవనాలు అనుమతులు లేకుండా నిర్మిస్తున్నారని, వాటిని వెంటనే నిలిపివేయాలని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో సమావేశంలో ఈ కట్టడాలపై వివరించారు. తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాస్, సాంబాయిగూడెం కార్యదర్శికి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు.

ముంపు ముప్పు తప్పేనా?

- వరుసగా రెండో సంవత్సరమూ దాదాపు మునక
- చర్యలు చేపట్టినా తప్పని ముప్పు
- శాశ్వత పరిష్కారం చూపాలని మణుగూరు వాసుల వేడుకోలు


ఇటీవల కురిసిన వర్షాలతో కట్టువాగు నుంచి పట్టణంలోకి ప్రవేశిస్తున్న వరద నీరు


సైడ్ కాల్వలో పేరుకుపోయిన చెత్త


మణుగూరులో రోడ్డుపై నిలిచిన వరద (ఫైల్)

మణుగూరుటౌన్: వానకాలం వచ్చిందంటే మున్సిపాలిటీ ప్రజలు ముంపు భయంతో బెంబేలెత్తిపోతున్నారు. ఏ వర్షం తమను ముంచెత్తుతుందో తెలియక భయకంపితులవుతున్నారు. గత ఏడాది ఆగస్టు 31న జోరు వర్షం కారణంగా మణుగూరు ప్రధాన వీధులు మునిగి చాలామంది నిరాశ్రయులైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ముందస్తుగా మున్సిపాలిటీలో, అటు పంచాయతీల్లో అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినా మళ్లీ మణుగూరులోని కొన్ని వీధులు మునగడం, స్థానికులు బయటికి రాలేని పరిస్థితి ఏర్పడటం భయందోళనకు గురి చేస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ముంపు ముప్పు తీవ్రత తప్పినప్పటికీ గతేడాది కురిసిన భారీ వర్షం ఈ ఏడాది పడితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

ఫలించని ముందస్తు చర్యలు

గతేడాది ఆగస్టు 31న రాత్రి కొద్ది గంటల వ్యవధిలో 31 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో నాడు మణుగూరు ప్రజలు అతలాకుతలమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఈ ఏడాది సింగరేణి రూ.83 లక్షల సీఎస్ఆర్ నిధులతో కట్టువాగు, మొట్టువాగు, కోడిపుంజుల వాగు పూడికతీత పనులు చేపట్టగా దాదాపు పూర్తయ్యాయి. అయినప్పటికీ గత మంగళవారం 18.9 సెంటీమీటర్ల వర్షపాతానికే పట్టణం గుండా ప్రవహించే వాగుల్లో భారీ వరద నీరు ప్రవహించి.. పట్టణంలోని వినాయకనగర్, సుందరయ్యనగర్ శివారు, ఆదర్శ్‌నగర్, మౌనిక రెస్టారెంట్ వీధి, గాంధీనగర్, మేదరబస్తీలోని పలు వీధులు నీటమునిగాయి. ముందస్తు చర్యలు చేపట్టినా ఈ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి.

సైడ్ డ్రెయిన్లలోనే చెత్త..

ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న సైడ్ కాల్వల్లో మురుగును తొలిగించడం లేదు. ఇక వానాకాలం ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిన ప్రదేశంలో మాత్రమే చర్యలు తీసుకుంటున్నారు తప్ప సైడ్ కాల్వలపై పూడుకుపోయిన మట్టి, చెత్త తొలిగింపుపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలున్నాయి. రోజూ పట్టణంలో 30–40 టన్నుల చెత్తను మున్సిపాలిటీ సిబ్బంది సేకరిస్తుండగా, రోడ్డుపై వ్యాపారాలు నిర్వహించే వర్తకులు సైడ్ కాల్వల్లో రోజుకు కొంత చెత్తను పారవేస్తున్నారు. దీంతో కొన్ని చోట్ల పూడుకుపోయిన మట్టితో ఏర్పడిన ఎత్తుపల్లాలతో వాగుల్లోకి కాల్వల్లో అక్కడక్కడా నిలిచిన మురుగు చెత్త సాఫీగా సాగే పరిస్థితి లేదు. ఈ అంశంపై పట్టణ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న వాదనలు ఉన్నాయి.

శాశ్వత పరిష్కారం చూపరూ..

మణుగూరు ముంపునకు గురవుతున్న సంఘటనలు మండల కేంద్రంగా ఉన్న మణుగూరు ప్రజలను తీవ్రంగా కలిచివేస్తోంది. వాగుల్లోని పూడికతీత పనులు అక్కడక్కడా తూతూ మంత్రంగా పూర్తి చేశారన్న ఆరోపణలున్నాయి. ముంపు సమయంలో అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు ఊరటనిస్తున్నా.. ముంపు ముప్పు తప్పించేందుకు శాశ్వత పరిష్కారాలు చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. వినాయకనగర్, గాంధీనగర్‌లకు పై నుంచి వచ్చే వరదను కట్టడి చేయాలని కోరుతున్నారు. పట్టణంలో ప్రధాన రహదారి సైడ్ కాల్వల్లో పూడికతీయాలని విన్నవిస్తున్నారు.

నియోజకవర్గాల్లో 'ఆకాంక్ష మేళా'


మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం రైతువేదికలో భద్రాచలం నియోజకవర్గ స్థాయి నీతి ఆయోగ్ ఆకాంక్ష మేళాను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరయ్యి మాట్లాడరు. రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మునగ, ఆయిల్‌ఫామ్, వెదురు వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తెల్లం సీతమ్మ, పీఏసీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, ఏడీఏ సుధాకర్, కేవీకే కొత్తగూడెం శాస్త్రవేత్త శరత్ చంద్ర, ఏఓ నవీన్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట రైతువేదికలో వ్యవసాయ శాఖ ద్వారా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన 'సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్' ఆకాంక్ష మేళా కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరయ్యారు. వ్యవసాయ ఉత్పత్తులతోపాటు నాబార్డు ద్వారా ఏర్పాటు చేసిన అజోల్ల పెంపకం, బయోచార్ తయారీ, చిరు ధాన్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, ఏడీఏ రవి కుమార్, ఏఓ శివరామ ప్రసాద్, చంద్రశేఖర్ రెడ్డి, అరుణ్‌బాబు, వినయ్, అనూష, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, మొగళ్లపు చెన్నకేశవరావు, సుంకవల్లి వీరభద్రరావు, రైతులు పాల్గొన్నారు.

ఏడీఏ ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: అజోల్లా వేయడం ద్వారా వరి పంట పొలాలకు ఎంతో మేలు చేకూరుతుందని మణుగూరు వ్యవసాయశాఖ ఏడీఏ బి.తాతారావు తెలిపారు. గురువారం మండలంలోని గుట్టమల్లారం గ్రామంలో ఉన్న రైతువేదికలో సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్ కార్యక్రమంలో భాగంగా ఆకాంక్ష మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ తాతారావు మాట్లాడుతూ.. అజోల్లా ఉపయోగాలు, ప్రత్యామ్నాయ సాగు, ప్రభుత్వ రాయితీలు, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యాన వన అధికారి, మత్స్యశాఖ సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆత్మ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శి బదిలీపై ఆందోళన


ఎంపీఓ రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

దుమ్ముగూడెం: మండలంలోని డబ్ల్యూఎల్ రేగుబల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి రోహిణి ఆకస్మిక బదిలీ అవడంపై గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఎంపీఓ బద్ది రామకృష్ణ, మండల పర్యటనలో ఉన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. గత రెండేళ్లుగా నిస్వార్థం, పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ.. ప్రజల మన్ననలు పొందిన చెన్ను రోహిణిపై కొంతమంది వ్యక్తులు వ్యక్తిగత కక్షలు, స్వప్రయోజనాల కోసం స్థానిక ప్రజా ప్రతినిధులకు తప్పుడు సమాచారం ఇచ్చారని తెలిపారు. దీంతో ఆమెను డిప్యుటేషన్ ద్వారా వేరే గ్రామపంచాయతీకి బదిలీ చేశారని, దీనిని ఖండిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. వెంటనే బదిలీని రద్దు చేయాలని కోరారు. గ్రామస్తులు కాలవ పూర్ణయ్య, సిద్ది ప్రవీణ్, మోతుకురి పున్నారావు, తోటమల్ల సంగీతరావు, రాయపూడి సుధారాణి, రాయపూడి పుష్పరాజు, జెట్టి రాజశేఖర్, జెట్టి వెంకట్రావు, సకినాల ప్రేమ్, జక్కా రాజు, మోతుకురి రఘు, బుయ్యని వంశీ, జెట్టి కల్యాణ్, వన్నల మదన్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి


బూర్గంపాడు: సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ నాయకుడు కొర్సా రాంబాబు

బూర్గంపాడు: ఆదివాసీ జాతి ప్రయోజనాల కోసం న్యాయపోరాటం చేస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుపై సేవాలాల్ సేన చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు కొర్సా జేజే రాంబాబు సూచించాచారు. బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీలకు మంత్రివర్గంలో చోటు కల్పించడాన్ని జీర్ణించుకోలేని సేవాలాల్ సేన ప్రతినిధులు.. ప్రభుత్వాన్ని, మంత్రులను, ఆదివాసీ ఎమ్మెల్యేలను బద్నాం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఆదివాసీ జేఏసీ నాయకులు బొర్రా భద్రయ్య, గనిబోయిన చింపిరయ్య, దనసరి శ్రీను, జానం శ్రీను, రాజినేని ప్రసాద్, సప్కా నాగేశ్వరరావు, కొర్సా వెంకటేశ్వర్లు, మెండి భాస్కర్‌రావు, సత్యం పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌ను వలస లంబాడాలు విమర్శిస్తే సహించబోమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా జాయింట్ సెక్రెటరీ సోందె మల్లు దొర అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఏవీఎస్పీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లంబాడా సంఘం నాయకులు హుస్సేన్ నాయక్, స్వరాజ్ నాయక్‌లు ఎమ్మెల్యేపై విమర్శించిన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో ఆదివాసీలను రెచ్చగొట్టే ప్రయత్నాలు లాంబాడాలు చేస్తే.. 2009 లాంటి ఉద్యమం మళ్లీ చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో రేసు ఆదినారాయణమూర్తి, రేసు తిరుపతిరావు, కారం గోపాల్, కోరం మురళి, కోరం బుర్రయ్య, గోవిందు, పొడియం సురేష్, వీరయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి


ఐలు నూతన కమిటీకి అభినందనలు తెలుపుతున్న న్యాయవాదులు

మణుగూరురూరల్: దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ కోసమే ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్(ఐలు) నిరంతరం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు కొల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని మౌనికా రెస్టారెంట్ కమ్యూనిటి హాల్‌లో జరిగిన న్యాయవాదుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా 2025–2027 సంవత్సరానికి గానూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ నూతన కమిటీని ఐలు రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా న్యాయవాది పోశం భాస్కర్ రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రావు, కోశాధికారిగా అంకం సర్వేశ్వరరావు, కార్యదర్శిగా ఈ రాము, ఉపాధ్యక్షురాలిగా దాసరి కవిత, సహాయ కార్యదర్శిగా జి.నాగార్జునరెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు జె.శివరామ్, జిల్లా అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి పి.కిషన్‌రావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, కుర్మా విజయ్‌రావు, రమేష్, శైలజ, సావిత్రి, జాడి చొక్కారావు, సంధ్య, వాసవి తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

ములకలపల్లి: మండల కేంద్రంలోని గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు చెపట్టిన స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బైపీసీలో 22 సీట్లకు 22 మంది అడ్మిషన్ పొందారు. ఎంపీసీలో 26 సీట్లకుగాను 19 మంది మాత్రమే జాయిన్ అయ్యారు. ఈ నేపథ్యంలో మిగిలిన 7 సీట్ల భర్తీకి నేడు (శుక్రవారం) కూడా స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు.

లింగన్న చిరస్మరణీయుడు

ములకలపల్లి: తుదిశ్వాస వరకూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా జీవించిన లింగన్న చిరస్మరణీయుడని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌కె.ఉమర్ అన్నారు. మండలపరిధిలోని గుట్టగూడెం గ్రామంలో కుంజా కృష్ణ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన లింగన్న ఆరవ వర్ధంతి సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణకు పాటుపడుతున్న లింగన్నను పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌తో హతమార్చారని ఆరోపించారు.వంకా సురేశ్, దుబ్బా వెంకటేశ్వర్లు, బత్తుల నాగరాజు పాల్గొన్నారు.

సమస్యలపై సీపీఎం సర్వే


అశ్వాపురం: మల్లెలమడుగులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చి వసతులు మరిచారని, నెలలు గడుస్తున్న వాటిని పరిష్కరించడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ.నర్సారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు అన్నారు. సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 8వ వార్డు మనుబోతుల చెరువు డబుల్ బెడ్ రూమ్ కాలనీలో సమస్యలపై గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు ఫ్రీ కరెంట్ వర్తింపజేయాలని, వీధిలైట్లు ఏరాపటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, పార్టీ సభ్యులు సక్కుబాయి, నాగమ్మ, రమేష్ పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామాన్ని సీపీఎం పార్టీ జిల్లా, మండల నాయకుల బృందం గురువారం సందర్శించారు. గ్రామంలో వీధులు, ఇంటింటికి నాయకులు తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బ్రహ్మచారి, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి నరసింహారావు, నాయకులు దండి రాములు, అశోక్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బొమ్మరాతి రాములు, స్వర్గం వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులపై పెసా గ్రామసభలు


దుమ్ముగూడెం: మద్యం దుకాణం నిర్వహణకు చేతులెత్తి అమోదం తెలుపుతున్న ప్రజలు

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు పంచాయతీలో మద్యం షాపు నిర్వహణకు గాను గురువారం నిర్వహించిన పెసా గ్రామ సభ అమోదం తెలిపింది. పంచాయతీలో మొత్తం 612 మంది ఓటర్లుండగా పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ వివేక్‌రామ్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో మొత్తం 90 మంది పాల్గొన్నారు. పాల్గొన్న వారంతా చేతులెత్తి అమోదం తెలియచేశారు. అమోదం తెలిపిన వారిలో ఎస్టీ ఓటర్లు 75 మంది, ఇతరులు 15 మంది ఉన్నారు. గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల కేంద్రంలో మద్యం దుకాణం నిర్వహణ కోసం గురువారం అధికారులు 'పెసా' గ్రామసభను ఏర్పాటు చేశారు. సభలో గ్రామస్తులు చేతులెత్తి మద్యం దుకాణం కోసం ఆమోదం తెలిపారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని, నిబంధనలు తప్పకుండా పాటించాలని కోరారు. గ్రామసభలో ఎంపీఓ మారుతీ యాదవ్, కరకగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, మాజీ సర్పంచ్ ఊకే రామనాథం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడి సభలను సహించం..

చర్ల: మొక్కుబడిగా పెసా గ్రామ సభలను నిర్వహిస్తే ఊరుకునేది లేదని ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం చర్లలో మాజీ ఎంపీపీ గొంది ముయ్యన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన జనాభాలో మూడో వంతు హాజరైన తరువాతనే పెసా సభ నిర్వహించాల్సి ఉంటుందని, అధికారులు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి మొక్కుబడిగా సభలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జీఎస్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వర ప్రసాద్, ఆదివాసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఇర్పా ప్రకాశ్, జీఎస్‌పీ నాయకులు ఇర్పా అరుణ్, తాటి వెంకటరావు, బీరబోయిన శేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పౌష్టికాహారం కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న ఐటీసీ, రోటరీ క్లబ్ ప్రతినిధులు

బూర్గంపాడు: ఐటీసీ, రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. బూర్గంపాడు సీహెచ్‌సీలో 15మందికి, మోరంపల్లిబంజర పీహెచ్‌సీలో 15మందికి పౌష్టికాహార కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఐటీసీ పీఎస్‌పీడీ డీజీఎం చెంగలరావు గర్భిణులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు చాంద్‌పాషా, డీపీ రాయ్, వైద్యులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ తిరుపతి, డాక్టర్ అనిత, డాక్టర్ లక్ష్మీసాహితి పాల్గొన్నారు.

యూరియా కొరతను నివారించండి

దుమ్ముగూడెం: మండలంలో రైతాంగానికి యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఏడీ సుధాకర్‌రావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. సరిపడా యూరియా తెప్పించాలని, ఆధార్ కార్డు ఆధారంగా కాకుండా రైతు సాగు చేసిన ఎకరాల ఆధారంగా యూరియా అందించాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు మండల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు బొల్లి సత్యనారాయణ, కొడాలి లోకేష్ బాబు, సున్నం నరసింహ చారి, బిల్లా ముత్యాలు, యాస శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

86 శాతం బొగ్గు ఉత్పత్తి

మణుగూరుటౌన్: ఏరియాలో జూలై నెలలో తీవ్ర వర్షప్రభావం కారణంగా 7.58 లక్షల టన్నులకు 6.51 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 86 శాతం సాధించామని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ గురువారం తెలిపారు. జీఎం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గనుల్లో నిలిచిన వర్షపు నీటి పంపింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. సెప్టెంబర్‌లో మణుగూరు ఓసీలోని ఓబీ వెలికితీత కాంట్రాక్ట్ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ సమావేశంలో అధికారులు వెంకట రామారావు, రమేశ్, శ్రీనివాస్, అనురాధ, సీతారాంబాబు, డీవైసీఎంఓ జ్యోతిర్మయి, ప్రవీణ్, సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై విద్యార్థులకు అవగాహన


విపత్తులపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ అద్దంకి నరేష్

మణుగూరురూరల్: మణుగూరు డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు తహసీల్దార్ అధ్యక్షతన జాతీయ విపత్తుల నివారణ సంస్థ ఆధ్వర్యంలో మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్ నేతృత్వంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ ధరిపా, బృంద సభ్యులు వరదలు, విపత్తులు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా రక్షించుకోవాలో, ఎలా ఎదుర్కొవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. సీఐ పాటి నాగబాబు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, ఆర్ఐ గోపి, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భద్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దమ్మపేట: ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కీసర లక్ష్మి అన్నారు. గురువారం ట్వినింగ్ కార్యక్రమంలో భాగంగా తాటిమల్లప్పగుంపు ప్రాథమికోన్నత పాఠశాల, ఆర్లపెంట ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు.. పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, క్రీడా గదులను చూపించి, వాటిపై తగు అవగాహన కల్పించారు.

తీర్థయాత్రలకు ఆర్టీసీ బస్సులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఆర్టీసీ అధికారులు భద్రాచలం డిపో నుంచి ప్రతి వారం తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులు నడపుతున్నట్లు గురువారం ప్రచారం నిర్వహించారు. భద్రాచలం నుంచి అన్నవరం, ద్రాక్షారామం, వాడపల్లి, ద్వారకాతిరుమల, యాదగిరిగుట్ట, స్వర్ణ గిరి, చింతల్ చిన్న జీయర్ ఆశ్రమం, వేములవాడ, కొండగట్టు తదితర తీర్థయాత్రలకు ప్రతి గురువారం రాత్రి ప్రత్యేక బస్సులు నడపబడుచున్నట్టు వెల్లడించారు. అలాగే 30 నుండి 40 మంది భక్తులు ఉంటే వారు కోరుకున్న తీర్థయాత్రకు ప్రత్యేక బస్సు ఆర్టీసీ ఏర్పాటు చేస్తుందని భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతి తెలిపారు. తీర్థయాత్ర ప్రచారంలో భద్రాచలం ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ రామయ్య, స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన విద్యార్థులు

పినపాక: మండల పరిధిలోని ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్ భాగంగా గురువారం మణుగూరు ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. విద్యార్థులకు వైద్యం పట్ల అవగాహన కల్పించేందుకు వారిని ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయులు అన్నపూర్ణ వివరించారు. ఆస్పత్రిలో జనరల్ వార్డు, డయాలసిస్ వార్డు, ఆపరేషన్ థియేటర్ మొదలుకుని వైద్యశాల మొత్తం చూపించే వివరించామన్నారు.

మంత్రికి వినతి

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్, కెనాల్ పనుల్లో బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని.. మొండికుంట గ్రామానికి చెందిన పోడు రైతుల సమస్యలపై మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ ఆధ్వర్యంలో గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఖమ్మంలో మంత్రి పొంగులేటి నివాసంలో కలిసి సమస్యలు విన్నవించారు.